ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 2 మార్చి 2024





కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ కనిపించింది. పార్టీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. సాధిద్దాం సాధిద్దాం...ప్రత్యేక హోదా సాధిద్దాం నినాదాలతో తిరుపతి లోని ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక హోదా-న్యాయ సాధన సభ మార్మోగింది.కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఆమ్ఆద్మీ పార్టీ జెండాలు సభలో రెపరెపలాడాయి. పీసీసీ చీఫ్ షర్మిల ప్రసంగం పట్ల శ్రేణులు ఉత్సాహంగా కనిపించారు. 'మోడీ-కేడీ' అంటూ సభికులతో చెప్పించడం, జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయాడంటూ 'రేవు దాటేంత వరకే ఓడ మల్లన్న, రేవు దాటిన తర్వాత బోడి మల్లన్న' సామెతను పలుమార్లు ఉటంకించడం, 'ఢిల్లీలో జగనన్న పిల్లి' అంటూ మాట్లాడిన సమయంలో కార్యకర్తలు చప్పట్లతో మారుమోగించారు.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, పల్లంరాజు, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, తులసిరెడ్డి,కనుమూరి బాపిరాజు,పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాంతియా కుమారి, ముఖ్య నాయకులు జేడీశీలం, మయ్యప్పన్, రాకేష్,సునీల,వేణుగోపాల రెడ్డి, మాగంటి గోపాల రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, ప్రమీలమ్మ,చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాస రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రామానాయుడు, సీపీఎం నేత గపూర్,ఆమ్ఆద్మీ పార్టీ నాయకులు మణినాయుడు,నీరుగట్టు నగేష్, వెంకటచలపతి తదితరులు పాల్గొన్నారు.

\- తిరుపతి(తిలక్‌రోడ్)



న్యాయ సాధన సభకు హాజరైన జనం మధ్య రెపరెపలాడుతున్న కాంగ్రెస్, వామపక్షాల పతాకాలు-వేదికపై కాంగ్రెస్ నాయకులతో సీపీఐ,సీపీఎం నేతలు నారాయణ, గపూర్

కాంగ్రెస్‌లో నయా జోష్

ప్రత్యేక హోదా నినాదాలతో మార్మోగిన ఎస్వీయూ స్టేడియం

మునికోటి ఆత్మాహుతికి మోదీ సమాధానమేంటి?

ప్రత్యేక హోదా కోసం 2015లో కాంగ్రెస్ కార్యకర్త మునికోటి తిరుపతిలో ఆత్మాహుతి చేసుకున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ ఆ కుటుంబానికి ఏమి సమాధానం చెబుతారు? ఈ రాష్ట్రానికి ఏమి చెబుతారు? తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రత్యేక హోదా హామీ ఇచ్చిన మోదీ, వెంకన్నకే పంగనామాలు పెట్టాడు. నిజమైన భక్తులు ఇలా చేస్తారా? పదేళ్లపాటు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తాం.

\- వైఎస్ షర్మిల, పీసీసీ చీఫ్



జగన్ ఢిల్లీలో ఎందుకు పోరాడరు?

కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే అక్కడి నాయకులు ఢిల్లీకి వచ్చి పోరాడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి అలా ఎందుకు పోరాటం చేయడంలేదు? కేవలం లోపాయికార ఒప్పందాలే ఇందుకు కారణం. ఈ విషయం ప్రజలందరూ గమనించాలి. దేశంలో బీజేపీపై పోరాటం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి మాత్రమే.

\- సచిన్ పైలెట్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి


దేవుడికే మోదీ పంగనామాలు



ప్రత్యేక హోదా కోసమే ఇండియా కూటమిలో చేరాం.హోదా కోసం ఏ పోరాటానికైనా కలిసి వస్తాం. దేశ ప్రజలకు భక్తితత్పరుడిగా కనిపించే మోదీ తిరుపతి దేవుడి సన్నిధిలో ఇచ్చిన మాటను తప్పి ఆ మూడు నామాల వాడికే పంగనామాలు పెట్టారు.బీజేపీ మతాన్ని ఆయుధంగా చేసుకుని విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ విచ్ఛిన్నానికి పాటుపడుతోంది. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వారికే రాయితీలను ఇస్తూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తోంది. మత సామరస్యం కోసం ఇండియా కూటమితో కలిసి పనిచేస్తాం.

\- గపూర్, సీపీఎం నేత

వైఎస్ బొమ్మనే కనుమరుగు చేసిన జగన్



కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా గతంలో ఒక హత్య కేసు నుంచి బయటపడడానికి 12మందిని చంపాడు. వైఎస్ రాజశేఖర రెడ్డి బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఆయన ఫొటోనే కనుమరుగు చేశాడు. అధికారం కోసం వాడుకుని వదిలేయడం వైసీపీ, టీడీపీలకు పరిపాటిగా మారిపోయింది.కాబట్టే ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరిబయట పడేయండి.

\- నారాయణ,సీపీఐ జాతీయ కార్యదర్శి

దేశ రాజకీయాల్లో గొప్ప మలుపు



తిరుపతి సభలో మూడు జెండాల కలయిక దేశ,రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపు.కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు దూరం కావడంతోనే బీజేపీ పదేళ్లగా కేంద్రంలో అధికారంలో వుంది.ఇలాంటి తప్పిదాలకు ఇక తావు ఇవ్వకూడదు. రాష్ట్రానికి ఏడుగురు ముఖ్యమంత్రులను అందించిన రాయలసీమ నేడు కరువు కాటకాలతో అల్లాడిపోతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 130 స్థానాల్లో విజయం సాధిస్తుంది. షర్మిలే కాబోయే సీఎం.

\-చింతామోహన్, కేంద్ర మాజీ మంత్రి

వైసీపీ తొత్తుల్లా ముగ్గురు సీఐలు

- శ్రీకాళహస్తి టీడీపీ నాయకులపై అక్రమ రౌడీషీట్లు తెరుస్తున్నారు
- న్యాయం చేయాలంటూ ఎస్పీకి పార్టీ నేతల ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం)/ శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముగ్గురు సీఐలు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు, రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎస్పీ మలిక గర్గ్‌ను కోరారు.శుక్రవారం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన టీడీపీ నాయకులు ఎస్పీని కలిశారు. పోలీసుల తీరు, అక్రమ కేసులు, రౌడీషీట్లు, వేధింపుల గురించి ఆమెకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి పార్టీ సమన్వయకర్త బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్, తొట్టంబేడు సీఐ శ్రీహరి, ఏర్పేడు సీఐ మల్లిఖార్జున్ వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదుచేయడమే కాకుండా రకరకాలుగా వేధిస్తున్నారన్నారు. ఏర్పేడు మండలంలో ఒకే కుంటుంబానికి చెందిన పి. ధనుంజయులు నాయుడు (67), చిరంజీవులు నాయుడు (69), పి. నాగరాజనాయుడు (52)తో పాటు పి. శివశంకర్‌రెడ్డి (69), మల్లిఖార్జున నాయుడు (62), బాబునాయుడు (58), కామాక్షి (46)పై రౌడీషీట్లు తెరిచారన్నారు.అయితే ఆ విషయం వారెవరికీ పోలీసులు ముందస్తుగా తెలియజేయలేదని చెప్పారు. మరో 42 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు పోలీసులు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తనకు సమాచారముందని వెల్లడించారు. మండల, క్లస్టర్ స్థాయిలో ప్రధానమైన నాయకులను విచారణ పేరుతో స్టేషన్లకు పిలుస్తున్నారన్నారు.అధికారులు బయటకు వెళ్లిపోతూ ఎటువంటి విచారణ లేకుండా స్టేషన్‌లోనే కూర్చోబెడుతున్నారని చెప్పారు.రోజు రాత్రి ఎప్పుడో సీఐ వచ్చేవరకు నాయకులు స్టేషన్‌లోనే ఉండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల వేళ పార్టీ ప్రధాన నాయకులు ప్రచార కార్యకలాపాల్లో పాల్గొనకుండా చేసేందుకే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటి గురించి ఎస్పీకి వివరించామని, ఎస్పీ సానుకూలంగా స్పందించడంతో పాటు దర్యాప్తు చేసి కేసులు, రౌడీషీట్లు అక్రమమని తేలితే తీసేస్తామని హామీ ఇచ్చారని సుధీర్‌రెడ్డి చెప్పారు.రాష్ట్రంలోని టీడీపీ నాయకులందరూ కూడా తమపై రహస్యంగా కేసులు నమోదుచేసి రౌడీషీట్లు ఏమైనా తెరిచారా అని చెక్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జిలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి నరసింహయాదవ్, కోశాధికారి కంఠా రమేష్,తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష,మీడియా ఇన్‌చార్జి శ్రీధర్‌వర్మ,శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో

పోలీసులు వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత శుక్రవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.క్రియాశీలకంగా ఉన్న పార్టీ కార్యకర్తలను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి రౌడీషీటర్, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి ఆదేశాలతో తన భర్త చంద్రబాబుపై 15 కేసులు పెట్టారని, ప్రతిపక్ష పార్టీలను అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జనసైనికులు గణేష్, చంద్రశేఖర్, శివకుమార్, బాలాజీ, రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



'చొక్కా చేతులు మడతపెట్టే సమయం ఆసన్నమైంది' అని జగన్ రెడ్డి పిలుపు ఇవ్వగానే వైసీపీ తమ్ముళ్లు సిద్ధం అయిపోయారు. అయితే ప్రత్యర్థుల మీద కాక, తమలో తామే కొట్టుకోవడం మొదలుపెట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఇందుకు తాజా వేదికగా మారింది. పరస్పర ఆరోపణలు, విమర్శలతో రచ్చకెక్కిన వైసీపీలోని రెండువర్గాలు ఇప్పుడు ఏకంగా దాడులు, పోలీసుకేసులతో రాజకీయాలను రసవత్తరం చేస్తున్నాయి.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చొక్కాలు మడతపెడుతున్న జగనన్న తమ్ముళ్లు

వేరు కుంపట్లతో మొదలై దాడుల దాకా...

- సూళ్లూరుపేట వైసీపీలో పరస్పర దాడులు

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి ఆరోపణలు, విమర్శలు, విడి సమావేశాలకు పరిమితమైన వైసీపీలోని రెండు వర్గాలు ఇప్పుడు అక్రమ దందాలను పరస్పరం అడ్డుకుంటున్నాయి. సూళ్ళూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట, ఓజిలి మండలాల్లో ఇసుక, గ్రావెల్ వంటి వనరులన్నింటినీ అధికార పార్టీ నేతలు ఇప్పటికే కరిగించేశారు. కేవలం పెళ్ళకూరు మండలంలో మాత్రమే వనరులు కొంతమేరకు మిగిలివున్నాయి. దాంతో అందరి చూపూ ఆ మండలంపై పడింది. నాయుడుపేట-రేణిగుంట సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున వాటిని సాకుగా చూపి గ్రావెల్ దోపిడీకి అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగారు. మూడు నెలలుగా భారీఎత్తున గ్రావెల్ దోపిడీ జరుగుతోంది. గ్రామాల అభివృద్ధి పేరిట కొంత మొత్తం స్థానికులకు అందజేసి గ్రామస్తుల నోళ్ళు మూయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.అయితే శిరసనంబేడు గ్రామంలో తవ్వకాలకు గ్రామస్తులే అడ్డుపడ్డారు.కొండ కరిగిపోతోందని, గ్రావెల్ తరలింపు వాహనాలతో రోడ్లు పాడైపోతున్నదని అభ్యంతరాలు చెబుతూ గ్రామస్తులు బలంగా అడ్డుకోవడంతో తవ్వకాలు నిలిచిపోయాయి. తర్వాత రోశనూరు గ్రామం వద్ద గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. అక్కడ కూడా గ్రామస్తులు అడ్డుకున్నారు. అధికార పార్టీ నేతలు వినకపోవడంతో గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తెచ్చి తవ్వకాలను నిలిపివేయించారు. చివరగా బంగారంపేట చెరువు నుంచీ గ్రావెల్ తవ్వి అక్రమంగా తరలించే పనిలో పడ్డారు ఎమ్మెల్యే అనుకూల వర్గ నేతలు. గురువారం సాయంత్రం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వైసీపీ నేత కళత్తూరు శేఖర్‌రెడ్డి వెళ్ళి అడ్డుకున్నారు. తవ్వకాలు జరుపుతున్న ఇటాచీ వాహనం తాళం లాక్కున్నారు. ఆ మండలానికి చెందిన డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి విషయం తెలిసి అనుచరులతో అక్కడికి చేరుకున్నారు. నాయుడుపేటకు చెందిన నాయకులకు ఇక్కడేమి పనంటూ శేఖర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి చీకట్లో పరస్పరం కలబడి తోపులాడుకోవడంతో దుస్తులు కూడా చిరిగిపోయాయి. ఉద్రిక్తత నెలకొనడంతో సకాలంలో పోలీసులు చేరుకుని శేఖర్‌రెడ్డిని నాయుడుపేట స్టేషన్‌కు తరలించి తెల్లవారుజామున విడిచిపెట్టారు. గురువారం రాత్రి ఘటనలో దళితులపై దాడి చేశారంటూ శేఖర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ కేసులో ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాయుడుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదుట డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అనుచరులతో బైఠాయించారు. అధికార పార్టీకే చెందిన ఓ నేతను అరెస్టు చేయాలని మరో నేత స్టేషన్ ఎదుట బైఠాయించడంతో అధికార పార్టీ ఇరకాటంలో పడింది. పోలీసు అధికారులకు కూడా తలనొప్పిగా పరిణమించింది. చివరికి నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు ఇద్దరూ న్యాయం చేస్తామని సర్దిచెప్పడంతో సత్యనారాయణరెడ్డి ఆందోళన విరమించి వెనుదిరిగారు. ఈ వరుస పరిణామాలు సూళ్ళూరుపేట నియోజకవర్గంలో అధికార పార్టీకి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఎన్నికల షెడ్యూలు కూడా విడుదల కాక ముందే పరిస్థితి ఇలా వుంటే రానున్న ఎన్నికల నాటికి పార్టీ నేతల మధ్య అనైక్యత, పలువురు నేతల రాజీనామాలు అధికార పార్టీ పుట్టి ముంచుతాయని ఆ పార్టీ శ్రేణులే వాపోతున్నాయి.

వేమిరెడ్డి ఎఫెక్ట్

ఇంతకాలం అసంతృప్తి ఉన్నా పార్టీలోనే అణగి ఉన్న పలువురు నాయకులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి వైసీపీని వీడడంతో తిరుగుబాటు జెండా ఎగరేస్తున్నారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు వేమిరెడ్డికి అనుచరులుగా వున్నారు. నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన వైసీపీ సీనియర్ నేతలు రాజశేఖరరెడ్డి, అనిల్ రెడ్డి, వారి అనుచరులైన ఎంపీటీసీ అల్లెమ్మ, సర్పంచ్ జ్యోతి తదితరులు మూడు రోజుల కిందట వైసీపీకి రాజీనామా చేశారు. ఆ వెంటనే మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అన్నమేడు మేజర్ పంచాయతీలో బాగా పట్టున్న వీరి చేరిక వైసీపీకి తీవ్ర నష్టం చేయనుంది. నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్, వైసీపీ సీనియర్ నేత రఫీ కూడా మూడు రోజుల కిందట ఆ పార్టీకి రాజీనామా చేశారు. వేమిరెడ్డికి అనుచరుడైన రఫీకి పట్టణంలో చెప్పుకోదగిన ప్రజాబలముంది. ఆయన త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఇతడి నిష్క్రమణ సైతం వైసీపీకి గణనీయమైన నష్టం కలిగించనుంది. తాజాగా శుక్రవారం నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా రమణారెడ్డి, ఆయన సతీమణి, రెడ్డి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కట్టా సురేఖ వైసీపీకి, పదవులకు రాజీనామా ప్రకటించారు. అదే మండలం మర్లపల్లి సర్పంచ్ మంజులమ్మ, భర్త సీనియర్ వైసీపీ నేత రవీంద్ర కూడా అధికార పార్టీకి గుడ్‌బై చెప్పారు. వీరంతా త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఈ వరుస రాజీనామాలు అధికార పార్టీని కుదిపేస్తున్నాయి. ఎన్నికల వేళ ఈ పరిణామాలు వైసీపీని తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నాయి.



చిన్నశేష వాహనం, హంస వాహనంపై కల్యాణ వెంకన్న విహారం

హంస వాహనంపై చదువుల తల్లి రూపుడై

కోలాహలంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, మార్చి1: శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పట్టు పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో మురళీకృష్ణుడు అలంకరణలో చిన్నశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి శోభాయమానంగా సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై మాడ వీధుల్లో వృషభ, అశ్వ, గజరాజులు ముందు నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామస్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు.కాగా శుక్రవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉత్సవమూర్తులకు కన్నుల పండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ శేషాచార్యులు, వైఖానస ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, ఏఈవో గోపీనాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారథి, నారాయణచార్యులు, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి

చంద్రగిరి, మార్చి 1: టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రగిరిలో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నానీ కృషి చేస్తారని ఆయన తనయుడు వినీల్ అన్నారు. శుక్రవారం చంద్రగిరి మండలంలోని ఐతేపల్లె, మామండూరు, అనంతగుర్రప్పగారిపల్లెలో మీఇంటి వద్దకు మీపులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి వినీల్ ఇంటింటికి వెళ్ళి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు,నాయకులు విశ్వనాథం, వెంకటముని, బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శానంబట్లలో 'గడప గడపకు'

చంద్రగిరి/పాకాల, మార్చి 1: చంద్రగిరి మండలం శానంబట్ల పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ యశోద,చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ కరపత్రాలు పంపిణీ చేశారు.అలాగే పాకాల మండలంలోని ఇపాలగుట్టపల్లె పంచాయతీ పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి సతీమణి లక్ష్మి గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు యనమలవారి పల్లె టీచర్



పాకాల, మార్చి 1: జాతీయస్థాయి సివిల్ సర్వీస్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు పాకాల మండలం యనమలవారి పల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎ.సుబ్రమణ్యం ఎంపికయ్యాడు. ఈయన ఇటీవల విజయవాడలో జరిగిన పోటీలలో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం చండీఘడ్‌లో ఈనెల 3 నుంచి 9వ తేదీవరకు జరిగే పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, ఉపాధ్యాయులు ఆయనను శుక్రవారం అభినందించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పాకాల, మార్చి 1: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 241మంది విద్యార్థులు హాజరు కావాల్సివుండగా 221 మంది హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ బేటీశ్వర రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి హరికృష్ణ తెలిపారు.

వైసీపీని ఓడించేందుకు ఓటర్లు సిద్ధం : నాని

ఎర్రావారిపాలెం, మార్చి1: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నానీ జోస్యం చెప్పారు. శుక్రవారం ఆయన ఎర్రావారిపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

అన్ని రంగాల్లో వైసీపీ ప్రభుత్వం విఫలం: బీజేపీ



ప్రజాపోరు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పాకాల, మార్చి 1: వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీజేపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు అన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కె.వడ్డేపల్లె, పాకాలలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. వైసీపీ నాయకులు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి ఇసుక, మద్యం, గ్రావెల్ మాఫియాలతో దండుకుంటున్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు కె.వెంకటాద్రినాయుడు, నరేంద్రబాబు, జనార్దన చౌదరి, ప్రభాకర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ ట్రిపుల్ ఐటీలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

శ్రీసిటీ, మార్చి 1: శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మూడు రోజుల టెక్నో కల్చరల్ ఫెస్ట్(అభిసర్గ 2024 పేరిట) కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇస్రో డైరెక్టర్ ఎ.రాజరాజన్ ట్రిపుల్ ఐటీ కళాశాల ఆడిటోరియంలో దీనిని ప్రారంభించారు.ఖరగపూర్ ఐఐటీ ప్రొఫెసర్ విశ్వనాథ్, నాగరాజన్, అంబర్ గ్రూప్ జనరల్ మేనేజర్ జగదీప్ హూనియా తదితరులు పాల్గొన్నారు. సాంకేతికపరంగా కొత్త కొత్త అంశాల్లో తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పరస్పరం తమ భావాలను పంచుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.ట్రిపుల్ ఐటీ ప్రతినిధులు సోమయాజులు, రాహుల్ కట్టి, కల్నల్ టి.ఉమాశంకర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై పద్మావతీ దేవి అభయం



తిరుచానూరు, మార్చి 1: తిరుచానూరు పద్మావతీ దేవి బంగారు శుక్రవారం తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు.ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు తీసుకొచ్చి తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, శేషగిరి, శ్రీవాణి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్‌నాయుడు, అశోక్, అర్చకులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

భాకరాపేట,మార్చి1: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో చిన్నగొట్టిగల్లు, భాకరాపేట, నెరబైలు,ఎర్రావారిపాళెం జూనియర్ కళాశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.మొదటిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు209 మందికిగాను 187 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగరాణి తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ

భాకరాపేట, మార్చి 1: రబీ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏవో ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని 1234 మంది రైతులు 1751.84 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయగా ఈ పంటలను వ్యవసాయ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేశారన్నారు. దీనికి సంబంధించిన జాబితాలు ఈనెల 3వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామన్నారు.జాబితా పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ సిబ్బందికి తెలియజేస్తే సవరించి తుది జాబితా ప్రకటిస్తామన్నారు.



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 793 మంది విద్యార్థుల గైర్హాజరు



తిరుపతి(విద్య), మార్చి1 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 9-12 గంటల వరకు జరిగిన లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ విభాగంలో 793మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నగరంలో ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేంద్రాల వద్ద సందడి వాతావరణం కనిపించింది. పరీక్ష ప్రారంభానికి అర్ధగంట ముందు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ట్రాఫిక్ సమస్యతో కొందరు విద్యార్థులు కొంత ఆలస్యంగా చేరుకుని పరుగు..పరుగున కేంద్రాల్లోకి వెళ్లడం కనిపించింది. కాగా తిరుపతిలోని ఎస్వీ బధిరుల జూనియర్ కేంద్రానికి వెళ్లాల్సిన ఇద్దరు విద్యార్థులు ఎస్వీ జూనియర్ కాలేజీ కేంద్రానికి చేరుకుని కొంత హైరానాపడ్డారు. వీరిని కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై బధిరుల జూనియర్ కళాశాల కేంద్రానికి తీసుకెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులు పరీక్ష రాసి బయటకు వచ్చే వరకు వారి తల్లిదండ్రులు, సహాయకులు కేంద్రాల సమీపంలోని చెట్లకింద, షాపుల వద్ద వేచి ఉండడం కనిపించింది.

- **తొలిరోజు 32,196మంది హాజరు:** జిల్లాలో 87 కేంద్రాల్లో జరిగిన ప్రథమ ఇంటర్ పరీక్షకు తొలిరోజు 32,989మంది విద్యార్థులకుగాను 32,196మంది హాజరయ్యారని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్‌లో 31,647మందికి 30,967మంది విద్యార్థులు హాజరవ్వగా 680మంది గైర్హాజరయ్యారని, ఒకేషనల్ విభాగంలో 1,342మందికిగాను 1,229మంది పరీక్ష రాయగా..113మంది విద్యార్థులు హాజరుకాలేదని వెల్లడించారు. మొత్తంమీద జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 793మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో వెల్లడించారు. తొలిరోజు జిల్లాలో మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. శనివారం ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభంకానున్నాయి.



భూ వివాదాల పరిష్కారానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం

- సీఎం సలహాదారు అజయ్ కల్లం



అజయ్ కల్లంను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1: రైతుల మధ్య ఏర్పడిన భూ వివాదాలను పరిష్కరించే లక్ష్యంతోనే ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలు చేస్తోందని సీఎం సలహాదారు అజయ్ కల్లం పేర్కొన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరి సెమినార్ హాల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత భూ రికార్డులకు స్వస్తి పలకాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రైతులందరికీ శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అమల్లోకి తీసుకొచ్చామన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. తద్వారా భూ హక్కులపై రైతులకు పూర్తిస్థాయి భరోసా లభిస్తుందన్నారు. బ్రిటీష్ కాలంలో భూ రికార్డులు సక్రమంగా నిర్వహించలేదన్నారు. నాటి రికార్డులను ఆధునికీకరించడంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయని, తద్వారా భూ యజమానులు భూమి మీద సంపూర్ణ హక్కులు కోల్పోవడం జరుగుతుందన్నారు. రీ సర్వేలో భాగంగా ఎయిర్ క్రాఫ్ట్, రోవర్ వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి భూ సరిహద్దును జియో రెఫరెన్స్ చేసి రైతులకు హక్కు పత్రాలను జారీచేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం పట్ల రైతులకు అవగాహన పెంపొందించేందుకు వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో మొదటి కార్యక్రమం ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. భూ వివాదాలకు సంబంధించి రైతులు అడిగిన ప్రశ్నలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్వో పెంచల్ కిశోర్, తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, సర్వే అధికారి జయరాజ్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు, బ్యాంకింగ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తిరుచానూరులో ఫ్లెక్సీల రగడ

ఫ్లెక్సీలతో పనిలేదు... ప్రజల ఆదరాభిమానాలే చాలన్న నాని



టీడీపీ ఫ్లెక్సీని ట్రాక్టరులో తీసుకెళుతున్న దృశ్యం - పంచాయతీ సిబ్బందితో టీడీపీ నాయకుల వాగ్వాదం - వైసీపీ ఫ్లెక్సీ తీసుకెళ్తున్న పంచాయతీ సిబ్బంది



ఓటర్లను అభ్యర్థిస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 1: 'టీడీపీకి ప్రజల్లో ఆదరాభిమానాలున్నాయి. ఫ్లెక్సీలతో అవసరం లేదు.వైసీపీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. ప్రజలే చెవిరెడ్డికి ఎన్నికల్లో బుద్ధి చెబుతారు' అంటూ చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి తిరుచానూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇదే సమయంలోనే టీడీపీ ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించి ట్రాక్టరులో వేశారు. దీంతో టీడీపీ నాయకులు పంచాయతీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. చెవిరెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వైసీపీ ఫ్లెక్సీలు కూడా తొలగించాలని పట్టుబట్టడంతో స్థానిక వైసీపీ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నానీ మీడియాతో మాట్లాడుతూ శాంతియుతంగా ప్రచారం చేసుకుంటుంటే వైసీపీ నాయకులు అడ్డుతగలడం సబబు కాదన్నారు. చెవిరెడ్డి అనుచరుల అరాచకాలను, బెదిరింపులను ప్రజలు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో రౌడీయిజం, భూ బకాసురులను తరిమికొట్టాలంటే టీడీపీని ఈ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసుల రెడ్డి, నేతలు ఈశ్వర్ రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సల్మాన్‌రాజ్, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, పాండి, సాయి రాయల్, రమేష్, రాజేంద్ర, నాగూరు, రమేష్ చౌదరి, జీవన్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమించిన సుధాయాదవ్

- దిగివచ్చిన అధికార యంత్రాంగం
- తుమ్మలగుంట చెరువులో బఫర్ జోన్ ఏర్పాటు



బడి సుధా యాదవ్‌తో దీక్ష విరమింప చేస్తున్న ఆర్డీవో నిశాంత్‌రెడ్డి

తిరుపతి రూరల్, మార్చి 1: రెండు రోజులుగా నిరాహార దీక్ష చేపట్టిన ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ ఎట్టకేలకు దీక్ష విరమించారు. తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి దీక్షా శిబిరం వద్దకు వచ్చి సుధాయాదవ్‌తో చర్చించారు. తుమ్మలగుంట చెరువును సర్వే చేయించి, బఫర్ జోన్ ఏర్పాటు చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీవోతో కలిసి ఎంపీడీవో రమేష్‌బాబు, డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్, తహసీల్దార్ షేక్ బహబూబ్‌చంద్, సీఐ తమీమ్ అహ్మద్ నిమ్మరసం అందించి సుధాయాదవ్ దీక్ష విరమింప చేశారు. తన పోరాటానికి మద్దతు తెల్పిన నాయకులకు, ప్రజలకు ఈ సందర్భంగా సుధాయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన మీడియా సమావేశంలో బడి సుధాయాదవ్ మాట్లాడారు. అవినీతికి పాల్పడి ఉంటే తనతో పాటు ఎమ్మెల్యేపై కూడా సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ప్రాణ త్యాగానికైనా సిద్ధపడి పోరాటం చేస్తానని ఈ సందర్భంగా సుధాయాదవ్ స్పష్టం చేశారు. టీడీపీ నేతలు దంపూరు భాస్కరయాదవ్, కృష్ణయాదవ్, పుష్పావతి, ఆనంద్ యాదవ్, వూకా విజయకుమార్, శివరాయల్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, నాగార్జున యాదవ్, పరసాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



సిబ్బంది, కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

రామచంద్రాపురం, మార్చి 1: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆ పథకం పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగసభ ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, ఏపీడీ పద్మలత, జిల్లా విజిలెన్సు అధికారి భాగ్యలక్ష్మి, ఉపాధి కౌన్సిల్ మెంబరు ముత్యంశెట్టి విశ్వనాథ్, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఎస్ఆర్‌పీ రవి, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నానీకి ఒక్క అవకాశం ఇవ్వండి

భాకరాపేట, మార్చి 1: రాబోయే ఎన్నికల్లో పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి పులివర్తి సుధా రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మీ ఇంటికి మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీలో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు భద్రత, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి రెడ్డి, మునస్వామి నాయుడు, గురుమూర్తి, అమరనాథరెడ్డి, గుంతాటి మురళి, హనుమంత్ రెడ్డి, చంద్రశేఖర్, విజయశేఖర్ గౌడ్, మల్లికార్జున రెడ్డి, రాజగోపాల్ నాయుడు, రెడ్డప్ప రెడ్డి, జేడీ బాలాజీ, తులసీరాయల్, యశ్వంత్ రాయల్, రమేశ్, నాగిరెడ్డి, సహదేవరెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

మద్యం మత్తులో సహోద్యోగితో గొడవే కారణం



హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ

పాకాల, మార్చి 1 : పాకాల పోలీస్ స్టేషన్‌లో మద్యం సేవించి సహోద్యోగితో గొడవపడిన హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను ఎస్పీ మలిక గర్గ్ శుక్రవారం సస్పెండ్ చేశారు.చాలాకాలంగా ఈయన మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి. గురువారం సాయంత్రం కూడా మద్యం సేవించి విధులకు హాజరై మరో హెడ్ కానిస్టేబుల్ మొగిలీశ్వరరెడ్డితో గొడవపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో ఎస్పీ విచారణ జరిపించారు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భాకరాపేటలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంకటరమణపై అవినీతి ఆరోపణలు రావడంతో బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.రెండురోజుల వ్యవధిలో ఇద్దరు సస్పెండ్ కావడం పోలీసుల్లో చర్చనీయాంశమైంది.

ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి



మహేష్

చంద్రగిరి, మార్చి 1 : తనను ప్రేమించలేదన్న కోపంతో ఓ యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడి వుదంతం కలకలం రేపింది.పోలీసుల కథనం మేరకు తల్లిదండ్రులు చిన్నవయసులోనే మృతి చెందడంతో చంద్రగిరి పట్టణంలో ఓ యువతి తన అమ్మమ్మతో అద్దె ఇంట్లో ఉంటూ, తిరుపతి సమీపంలోని ఓ కళాశాలలో నర్సింగు కోర్సు చదువుతోంది.ఈ క్రమంలో ఆమె ఇంటి కింది భాగంలో వుంటోన్న మహేష్‌తో పరిచయం ఏర్పడింది.అయితే మహేష్ మద్యం సేవిస్తూ జులాయిగా తిరుగుతున్నాడని తెలిసి ఆమె ఒకటిన్నర నెల క్రితమే మాట్లాడడం ఆపేసింది. దీంతో మహేష్ మద్యం సేవించి యువతి ఇంట్లోకి వెళ్ళి గొడవ చేశాడు.దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆ యువతి తరువాత చెన్నైలో ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్ళిపోయింది. బుధవారం రాత్రి ఆమె చెన్నై నుంచి వచ్చిందని తెలుసుకున్న మహేష్ మద్యం సేవించి ఇంట్లోకి చొరబడి కత్తితో ఆమెపై దాడి చేశాడు.ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం,

విద్యాదీవెన నిధుల జమ

- 39,368మంది విద్యార్థులకు రూ.29.50కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1: జిల్లాలో విద్యాదీవెన పథకంలో 39,368మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. 2023 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి చెందిన ఫీజు రీయింబర్స్ ఆర్థిక సాయాన్ని శుక్రవారం తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. జమ అయిన పదిరోజుల లోపు సంబంధిత కళాశాలలకు చెల్లించి సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు చెక్కును అందజేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు, అధికారులు హాజరయ్యారు.

రుయాస్పత్రిలో చుక్కల దుప్పి మృతి



ఎమ్మారై స్కానింగ్ ముందు మృతిచెందిన దుప్పి

తిరుపతి సిటీ, మార్చి 1 : అడవిలో నుంచి జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కంగారులో రుయాస్పత్రిలోకి వచ్చి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రుయాస్పత్రి కార్యాలయ భవనం వెనుక ఉన్న దట్టమైన పొదల్లో చుక్కల దుప్పులు ఎక్కువగా సంచరిస్తూ ఉండేవి. నూతన భవనాల నిర్మాణాల కోసం కొంతకాలంగా ఆ చెట్లను తొలగిస్తున్నారు. దీంతో అక్కడ సంచరించే చుక్కల దుప్పులు సమీపంలోని జూపార్కు రోడ్డులోని అడవుల్లోకి వెళ్లిపోయాయి. ఇంకా కొన్ని సమీపంలోనే సంచరిస్తున్నాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంతం నుంచి సైకియాట్రీ వార్డు మీదుగా చిన్నపిల్లల వార్డు వద్దకు వచ్చిన ఓ చుక్కల దుప్పిని కుక్కలు వెంబడించడంతో పరుగులు తీస్తూ రుయాస్పత్రిలోని ఎమ్మారై స్కానింగ్ కేంద్రం వద్దకు వచ్చింది. అక్కడ నుంచి పారిపోయేందుకు ఐదు అడుగుల ఎత్తులో ఉన్న కంచెను దాటే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. గమనించిన స్థానికులు దానికి సాయం చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే అది మృతిచెందింది. ఇక్కడకు వచ్చే సమయంలోనే ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉందని, భయంతో ఇటుగా పరుగులు తీసి ఇక్కడికి వచ్చి మృతిచెందిందని స్థానికులు తెలిపారు. సమాచారమిచ్చినా అటవీ అధికారులు ఆలస్యంగా రావడంతో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది కాపలాగా ఉండి అప్పగించారు.

ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్సే



మాట్లాడుతున్న తాంతియా కుమారి

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 1: అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆర్టీఏ మాజీ కమిషనర్ తాంతియా కుమారి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందని విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు అధికారం చేపట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నించారే తప్పా ప్రత్యేక హోదా కోసం పోరాడలేదన్నారు. ప్రశ్నించే వారిపై ఈడీ కేసులు నమోదు చేయడం బీజేపీకి పరిపాటిగా మారిందన్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ఒక చేత్తో డబ్బు ఇచ్చి, మరో చేత్తో మద్యం రూపంలో తీసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. అనంతరం మహిళా కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షురాలిగా మోసిన బేగంను నియమించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గాల ఇన్‌చార్జులు సుశీల, సుభాషిణి, భాను, శివకుమారి పాల్గొన్నారు.

రేపు పిల్లలకు పోలియో చుక్కలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి సిటీ / తిరుపతి (కలెక్టరేట్), మార్చి 1 : కొవిడ్ కారణంగా రెండేళ్లుగా నిలిచిన పల్స్ పోలియో కార్యక్రమం తిరిగి ఆదివారం ప్రారంభంకానుంది. ఈసారి కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 0-5 ఏళ్లలోపు 2,53,282 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 1,824 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,492 అంగన్‌వాడీ కేంద్రాలు, 58 పీహెచ్‌సీల పరిధిలో ఏర్పాట్లను పూర్తి చేశారు. 7,774 మంది సిబ్బందిని నియమించారు. ఇప్పటికే జిల్లాకు 3,36,860 డోసులు చేరుకున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పట్టణ ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారుల సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ఇక ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4, 5వ తేదీలలో సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వేయనున్నారు.

ప్రతి చిన్నారికీ తప్పక చుక్కలు వేయించాలి

- జిల్లాలోని ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రోజునే లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా అన్ని ఏర్పాట్లు చేశాం. మారుమూల గ్రామాల్లోని చిన్నారులను గుర్తించి, పోలియో చుక్కలు వేసేందుకు 185 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాం. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా చుక్కలను వేస్తారు. అపోహలకు గురికాకుండా పోలియో చుక్కలు వేయించడం సురక్షితం.

\- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

తిరుమల రేపు పల్స్‌పోలియో

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా తిరుమలలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఎస్వీ హైస్కూల్ నుంచి స్థానికులు నివాసముండే బాలాజీనగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి యాత్రికులకు, స్థానికులకు జీపులో ప్రకటనలు చేస్తూ అవగాహన కల్పిస్తారు.

డాక్టరేట్ ప్రదానం


శ్రీలక్ష్మీరమేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1: పద్మావతి మహిళా యూనివర్సిటీ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగ పరిశోధకురాలు శ్రీలక్ష్మీరమేష్ డాక్టరేట్ డిగ్రీ పొందారు. యూజ్ ఆఫ్ సోషియల్ నెట్ వర్కింగ్, షాపింగ్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ యాప్స్ బై ఉమెన్ కాలేజ్ స్టూడెంట్స్ ఎ స్టడీ ఇన్ సబర్బన్ చెన్నై అంశంపై ఆమె సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు జర్నలిజం విభాగ ప్రొఫెసర్ తెలంగంశెట్టి త్రిపురసుందరి పర్యవేక్షకురాలుగా వ్యవహరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.67 కోట్లు

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.67 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,338 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,852 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 0877-2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

దుకాణాల ముందు ఆక్రమణల తొలగింపు



తిరుమల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలోని దుకాణాల ముందున్న ఆక్రమణలను శుక్రవారం అధికారులు తొలగించారు. షాపింగ్ కాంప్లెక్స్, డీఎంబీ రోడ్డు, సీఆర్వో వంటి ప్రాంతాల్లో టీటీడీ నిబంధనలకు వ్యతిరేకంగా దుకాణాల ముందు ఆక్రమణలపై టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు రెవెన్యూ, విజిలెన్స్, హెల్త్ విభాగం అధికారులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆక్రమణలను తొలగించారు. టీటీడీ కేటాయించిన స్థలం కంటే అధికంగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తే ఉపేక్షించబోయేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

అందరి చేత శభాష్ అనిపించుకున్నా..

● బలిజల ఆత్మీయ సమావేశంలో భూమన



తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : 'నా వల్ల అన్యాయం జరిగిందని ఏ ఒక్కరు చెప్పినా నేను దేనికైనా సిద్ధమే. టీటీడీ చైర్మన్‌గా ఉద్యోగులకు, తిరుమల స్థానికులకు ఎంతో మేలు చేశా.. నగరాన్ని ఆధ్యాత్మికంగా, అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లా.. అందరూ కాలర్ ఎగరేసేలా చేశా.. ఇప్పుడు వేదికమీద నేను కూడా కాలర్ ఎగరేస్తున్నా' అంటూ టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. బలిజల ఆత్మీయ సమావేశం శుక్రవారం ఓ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభినయ రెడ్డి తనకంటే గొప్పగా ఆలోచన చేయగలడని, చక్కగా పనిచేయగలడని, కాబట్టి అందరూ ఆశీర్వదించాలని కోరారు. అభినయ్ గెలిస్తే ఊరు బాగుపడుతుందని అన్నారు. డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబాన్ని కాపుగాచిన కాపు సామాజికవర్గాన్ని ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. తన రాజకీయ గురువులు బలిజలేనన్నారు. నగర అభివృద్ధి కోసం తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బలిజ నాయకులు నీలం బాలాజీ, నంద గోపాల్, బాలిశెట్టి కిషోర్, అనిల్ రాయల్, అనీష్ రాయల్ పొన్నాల చంద్ర, దొరైరాజ్, సునీల్ చక్రవర్తి పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



సతీష్‌రెడ్డి - సుమయ రెడ్డి

తిరుమల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ మంత్రి సిద్దా రాఘవరావు, ఐఏఎస్ అధికారి హరినారాయణన్, టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ రవీందర్ రావు, హీరోయిన్ సుమయ రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాల అందజేశారు.

గణేష్ వ్యాఖ్యలు సరికాదు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 1: తిరుపతి నగరపాలక సంస్థ మూడవ డివిజన్ కార్పొరేటర్ తమ్ముడు గణేష్ కృష్ణయాదవ్‌పై చేసిన వ్యాఖ్యలు సభ్యతగా లేవని, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులుగా ఏనాడూ అభిమానులకు కేటాయించిన టిక్కెట్లను అక్రమంగా అమ్ముకోలేదని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల అసోసియేషన్ నాయకులు హేమంత్, నాని అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ అబద్ధపు ఆరోపణలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు. కృష్ణయాదవ్ సేవాతత్పరుడని, అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, కులధూషణకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో కిరీటి, తులసి, మురళి, బాల పాల్గొన్నారు.

వలంటీర్‌పై సైబర్ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1: తిరుపతి ఈస్ట్ పోలీసులు చిత్తూరు జిల్లాకు చెందిన ఓ వలంటీర్‌పై సైబర్ కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌడేపల్లె మండలం బయ్యప్పల్లి గ్రామ వలంటీర్ జి.నాగేంద్రకు తిరుపతిలోని ఓ యువతికి పరిచయస్తుడు. ఆ యువతికి ఇటీవల పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఈ క్రమంలో యువతి గురించి వరుడి సెల్‌ఫోన్‌కి అసభ్యంగా మెసేజ్ పెట్టాడు. దీనిపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో గురువారం ఈస్ట్ పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. శుక్రవారం నాగేంద్రను అరెస్ట్ చూపిస్తూ.. 41 నోటీసు జారీ చేశారు.


కాంగ్రెస్ నేత రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళుతున్న పార్టీ శ్రేణులు

5, 6 తేదీల్లో వెటర్నరీలో పశువిజ్ఞాన ప్రదర్శన

తిరుపతి(విద్య), మార్చి1 : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో ఈ నెల 5, 6 తేదీలు పశు విజ్ఞాన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలోని విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. పశువైద్య విద్యకి సంబంధించిన నమూనాలు, ప్రయోగశాలలతో పాటు అనాటమీ, పాథాలజీ మ్యూజియం, డెయిరీ టెక్నాలజీ కళాశాలలో పాల ఉత్పత్తుల ప్రయోగశాలలను సందర్శించి పలు విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. నగరంలోని విద్యాసంస్థల యాజమాన్యాలు తమ విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా చూడాలని కోరారు.

కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం




తిరుపతి (కల్చరల్), మార్చి 1: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో మొదలయ్యాయి. ఉదయం 7.40 గంటలకు మీన లగ్నంలో పంచమూర్తులైన సోమస్కందస్వామి, కామాక్షి అమ్మవారు, వినాయక స్వామి, చండికేశ్వరస్వామి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో అర్చకస్వామి, కంకణ భట్టారు మణివాసన్ గురుకుల్ ఆధ్వర్యంలో కపిలేశ్వర స్వామివారి ఉత్సవాలకు ప్రారంభసూచికగా ధ్వజారోహణం చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్లకు హంసవాహన సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు.

ఘనంగా వెంకటరమణ జయంతి


వెంకటరమణ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సుగుణమ్మ, కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు

తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ 77వ జయంతి వేడుకలను శుక్రవారం కపిలతీర్థం రోడ్డులోని ఆయన ఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కుటుంబ సమేతంగా ఘాట్ వద్దకు చేరుకుని ఘన నివాళి అర్పించారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలనేదే ఆయన కోరిక అని, ఆశయాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. అనంతరం రుయా ఆస్పత్రి ఎదుట అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, బీవీ కీర్తి, చిట్టిబాబు, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, పులిగోరు మురళీకృష్ణా రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, చిన బాబు, రుద్రకోటి సదాశివం, బిజి కృష్ణ యాదవ్, పల్లివీధి రమేష్, పుష్పావతి, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, రేవతి, అనిత, హేమ, ఆర్సీ శ్రీనివాస్, ఆనంద్ యాదవ్, రాజయ్య, విశ్వనాథం, కరాటే చంద్ర, కేవి రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్యమత స్టిక్కర్‌తో తిరుమలకు ద్విచక్ర వాహనం



తిరుమల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అన్య మతానికి చెందిన నినాదంతో శుక్రవారం ఓ ద్విచక్రవాహనం తిరుమలకు రావడం కలకలం సృష్టించింది. ఈ వాహనాన్ని ఆలయానికి సమీపంలో పార్కు చేయడం చర్చనీయాశమయ్యింది. సాధారణంగా తిరుమలకు హిందూయేతర మతాల గుర్తులు, నినాదాలు, జెండాలతో రావడం నిషేధం.వీటిని అలిపిరి చెక్‌పాయింట్‌లోనే గుర్తించి భద్రతా సిబ్బంది తొలగించాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఏపీ 40 బీ 9928 నెంబరు గల ద్విచక్రవాహనం అన్యమతానికి చెందిన స్టిక్కర్‌తో శుక్రవారం తిరుమలకు వచ్చింది. ఈ విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో విజిలెన్స్ అధికారులు అక్కడికి చేరుకుని స్టిక్కర్‌ను తొలగించారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● స్విమ్స్‌లో కాంట్రాక్టు కార్మికుల రిలే నిరాహార దీక్ష


స్విమ్స్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్న కార్మికులు

తిరుపతి సిటీ, మార్చి 1 : సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో డైరెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం రిలే నిరాహార దీక్షకు దిగారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ స్విమ్స్‌లో కాంట్రాక్టు కింద పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచడంలో, హోదాలు మార్చడంలో టీటీడీ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కష్టానికి తగిన వేతనం ఇవ్వకపోగా వారిపై పనిభారం పెంచడం అన్యాయమన్నారు. మహిళా కార్మికులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గది లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు ఈ రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఎంఎస్ రామ్ అక్కడికి చేరుకుని సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు రవి, సూరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశపరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999 నంబర్లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు గడువు, ప్రవేశపరీక్షల తేదీలు ఇలా..

క్రమసంఖ్య	ప్రవేశపరీక్ష	దరఖాస్తు గడువు	పరీక్ష నిర్వహించే తేదీ
1	ఏపీఆర్‌జేసీ	31-03-2024	25-04-2024
2	ఏపీపాలిసెట్	05-04-2024	27-04-2024

3నుంచి ఏపీ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి(విద్య), మార్చి 1 : రాష్ట్రంలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో 2024-25విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్స్ జేడీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్కూల్స్‌లో చదవడం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు డీఈవో, ప్రిన్సిపాల్స్ అవగాహన కల్పించాలని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 1: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కలెక్టర్ లక్ష్మీశ అభినందించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వారికి ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతి అందజేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, లీడ్‌బ్యాంకు మేనేజరు సుభాష్, సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు మల్లీశ్వరి, వెంకటేశ్వర్లు, తిరుపతి బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

తిరుమల ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1: కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పట్ల అమానవీయంగా ప్రవర్తించిన తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ కొండప్పపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ పట్ల డీఎస్పీ వ్యవహరించిన తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కులం పేరుతో దూషించడం, అక్రమ వసూళ్లు చేయమని ఒత్తిడి చేయడం, కానిస్టేబుల్‌ను వేధించి ఆయన అనారోగ్యానికి కారణం కావడం తీవ్రమైన నేరాలన్నారు. డీఎస్పీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి భవిష్యత్తులో మరెవరూ ఇలా వ్యవహరించకుండా గుణపాఠం నేర్పించాలని, కానిస్టేబుల్ వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి


వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1 : సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధతగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఓటర్ల జాబితా, సార్వత్రిక ఎన్నికలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ బీఎల్వోలకు ఈవీఎం, ఎంసీసీ తదితర ట్రైనింగ్‌లు షెడ్యూలు మేరకు పూర్తి కావాలన్నారు. పెండింగ్ క్లైములపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మార్చి 5 నాటికి కనీస వసతులు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు కిరణ్‌కుమార్, నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చంద్రముని, రామమోహన్, కోదండరామిరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1: ఎస్వీ యూనివర్సిటీలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మేళా ప్రారంభమవుతుంది. గ్రిండ్‌విల్ నోర్టన్ లిమిటెడ్, క్యాడ్ ఇన్‌స్టిట్యూట్, క్యాండీ క్లాస్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, ర్యాండ్‌స్టాండ్ ఇండియా సంస్థలు పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమో, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ చదువుకున్న వారు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 7989810194లో సంప్రదించవచ్చునని ఎస్వీయూ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వీసీ వేంకటేశ్వర్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 13మందికి జరిమానా

తిరుపతి(లీగల్), మార్చి 1: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 13మందికి జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిప్ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు వీరిని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

ఇండోర్ స్టేడియానికి రూ.10కోట్లు : టీటీడీ చైర్మన్

అట్టహాసంగా ప్రారంభమైన టీటీడీ వార్షిక క్రీడలు


వాలీబాల్ త్రో చేసి క్రీడలను ప్రారంభిస్తున్న కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి

తిరుపతి(కొర్లగుంట), మార్చి 1: టీటీడీ ఉద్యోగులకు క్రీడల పట్ల ఉన్న శ్రద్ధను గమనించి గత బోర్డు సమావేశంలో ఇండో ర్ స్టేడియం నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలను తిరుపతిలోని పరిపాలన భవనంలో శుక్రవారం ఉదయం ప్రారంభించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఉద్యోగులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఉద్యోగులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగులకు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు, క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు ఏటా క్రీడా పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు పునరుత్తేజం కలుగుతుందని చెప్పారు. టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత మాట్లాడుతూ ఈ పోటీలలో మొదటిస్థానంలో నిలిచిన వారికి రూ.2వేలు, ద్వితీయ స్థానం వారికి రూ.1,800, తృతీయస్థానానికి రూ.1,600విలువ గల బ్యాంకు గిఫ్ట్ కార్డులను బహూకరిస్తామన్నారు. అనంతరం చైర్మన్, ఈవో వాలీబాల్ త్రోచేసి క్రీడలను ప్రారంభించారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరావు, ముఖ్యగణాంకాధికారి శేషశైలేంద్ర, సీపీఆర్వో డాక్టర్.టి.రవి, వీజీవో బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టగ్ ఆఫ్ వార్‌లో ప్రతిభ

టీటీడీ వార్షిక క్రీడలలో భాగంగా తొలిరోజు టగ్ ఆఫ్ వార్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అధికారుల విభాగంలో చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు జట్టు విజేతగా, సీపీఆర్వో డాక్టర్ టి.రవి జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళా విభాగంలో జమున జట్టుపై యశోద జట్టు విజయం సాధించింది. కుమారిదేవి జట్టుపై దామరసెల్వి జట్టు గెలుపొందింది. పురుష విభాగంలో దేవసుందరం జట్టుపై రాజేంద్రన్ జట్టు, బాలాజిసింగ్ జట్టుపై మునివెంకటరెడ్డి జట్టు విజయం సాధించాయి.

షార్ కాంట్రాక్టర్ ఆత్మహత్య



నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 1: సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న షార్ కాంట్రక్టర్ వి.నాగేశ్వర రావు (55) శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసుల సమచారం మేరకు.... రాజమండ్రికి చెందిన నాగేశ్వరరావు గత 20 సంవత్సరాలు షైబడి షార్‌లో అనుసూయ ఇంజినీరింగ్ వర్క్స్ పేరుతో స్ట్రక్చరల్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నారు. బాలాజీ నగర్‌లోని సొంత ఇంట్లో తన వద్ద పనిచేస్తున్న వర్కర్స్ ఉంటుండగా ఆయన బాపూజీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఇటీవలే ఇంటిని కూడా అమ్మేసినట్లు తెలిసింది. శుక్రవారం అమ్మిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన బాలాజీ నగర్‌లో ఉన్న తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్యహత్య చేసుకొన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సిబ్బంది నాగేశ్వరరావు ఉరేసుకొని మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆయన భార్యకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి భార్యను వివరాలడిగి తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు, నగదు స్వాధీనం

గూడూరు, మార్చి 1: ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకుండా రైలులో అక్రమంగా తరలిస్తున్న 200గ్రాముల బంగారాన్ని, రూ.14.75లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరి అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న సంగమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా నెల్లూరుకు చెందిన తులసీరామకృష్ణ, ఆసీస్ పాల్లాట్ అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశామన్నారు. వారి బ్యాగుల్లో ఎటువంటి రసీదులు లేని 200 గ్రాముల బంగారం, రూ.14.75లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీల్లో సిబ్బంది జయప్రకాష్, వెంకటేశ్వర్లు, గణేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 793 మంది విద్యార్థుల గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి1: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 9-12 గంటల వరకు జరిగిన లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ విభాగంలో 793మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నగరంలో ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేంద్రాల వద్ద సందడి వాతావరణం కనిపించింది. పరీక్ష ప్రారంభానికి అర్థగంట ముందు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ట్రాఫిక్ సమస్యతో కొందరు విద్యార్థులు కొంత ఆలస్యంగా చేరుకుని పరుగు..పరుగున కేంద్రాల్లోకి వెళ్లడం కనిపించింది. కాగా తిరుపతిలోని ఎస్వీ బధిరుల జూనియర్ కేంద్రానికి వెళ్లాల్సిన ఇద్దరు విద్యార్థులు ఎస్వీ జూనియర్ కాలేజీ కేంద్రానికి చేరుకుని కొంత హైరానాపడ్డారు. వీరిని కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై బధిరుల జూనియర్ కళాశాల కేంద్రానికి తీసుకెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులు పరీక్ష రాసి బయటకు వచ్చే వరకు వారి తల్లిదండ్రులు, సహాయకులు కేంద్రాల సమీపంలోని చెట్లకింద, షాపుల వద్ద వేచి ఉండడం కనిపించింది.

- తొలిరోజు 32,196మంది హాజరు: జిల్లాలో 87 కేంద్రాల్లో జరిగిన ప్రథమ ఇంటర్ పరీక్షకు తొలిరోజు 32,989మంది విద్యార్థులకుగాను 32,196మంది హాజరయ్యారని ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్‌లో 31,647మందికి 30,967మంది విద్యార్థులు హాజరవ్వగా 680మంది గైర్హాజరయ్యారని, ఒకేషనల్ విభాగంలో 1,342మందికిగాను 1,229మంది పరీక్ష రాయగా..113మంది విద్యార్థులు హాజరుకాలేదని వెల్లడించారు. మొత్తంమీద జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 793మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐవో వెల్లడించారు. తొలిరోజు జిల్లాలో మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. శనివారం ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

రేపు పిల్లలకు పోలియో చుక్కలు



పల్స్‌పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి సిటీ/తిరుపతి (కలెక్టరేట్), మార్చి 1: కొవిడ్ కారణంగా రెండేళ్లుగా నిలిచిన పల్స్ పోలియో కార్యక్రమం తిరిగి ఆదివారం ప్రారంభం కానుంది. ఈసారి కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 0-5 ఏళ్లలోపు 2,53,282 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 1,824 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,492 అంగన్‌వాడీ కేంద్రాలు, 58 పీహెచ్‌సీల పరిధిలో ఏర్పాట్లను పూర్తి చేశారు. 7,774 మంది సిబ్బందిని నియమించారు. ఇప్పటికే జిల్లాకు 3,36,860 డోసులు చేరుకున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పట్టణ ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారుల సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ఇక ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4, 5వ తేదీలలో సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వేయనున్నారు.

ప్రతి చిన్నారికీ తప్పక చుక్కలు వేయించాలి

జిల్లాలోని ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రోజునే లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా అన్ని ఏర్పాట్లు చేశాం. మారుమూల గ్రామాల్లోని చిన్నారులను గుర్తించి, పోలియో చుక్కలు వేసేందుకు 185 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాం. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా చుక్కలను వేస్తారు. అపోహలకు గురికాకుండా పోలియో చుక్కలు వేయించడం సురక్షితం. - డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

బస్సు - ఆటో ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు

కోట, మార్చి 1: మండల పరిధిలోని చిట్టేడు వద్ద శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సు - ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు... వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కోట నుంచి గూడూరుకు బయలుదేరింది. చేపల లోడుతో కోట వైపు వెళ్తున్న ఆటో చిట్టేడు వద్ద గెడెను తప్పించబోయి బస్సును ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న కోటి, జానీ, బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోట ఆస్పత్రికి తరలించారు. కోటి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తీసుకెళ్లారు.

మరింత ముదిరిన వైసీపీ వర్గపోరు

శేఖర్‌రెడ్డిని అరెస్టు చేయాలంటూ కామిరెడ్డి ఆందోళన



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన వైసీపీ శ్రేణులు

నాయుడుపేట టౌన్, మార్చి 1: అధికార పార్టీ వైసీపీలో వర్గపోరు మరింత ముదిరింది. పెళ్లకూరు మండలం బంగారంపేట వద్ద మట్టిని తరలిస్తున్న టిప్పర్లను వైసీపీ సీనియర్ నేత కళత్తూరు శేఖర్‌రెడ్డి తన వర్గీయులతో కలసి గురువారం అడ్డుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి, కళత్తూరు శేఖర్‌రెడ్డికీ మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో దళితులపై శేఖర్‌రెడ్డి దాడి చేశాడంటూ సత్యనారాయణరెడ్డి నాయుడుపేట రూరల్ సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కళత్తూరు శేఖర్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలంటూ శుక్రవారం సాయంత్రం కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు నాయుడుపేట పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దళితులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగదన్నారు. విచారించి న్యాయం చేస్తామని అర్బన్, రూరల్ సీఐలు శ్రీనివాసులురెడ్డి, జగన్‌మోహన్‌రావు చెప్పడంతో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ధర్నాను విరమించి వెళ్లిపోయారు. కాగా, అసమ్మతి నేత, చెంగాళమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఇంటికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వెళ్లి మంతనాలు జరిపినట్లు సమాచారం. ఈ గొడవ సర్దుమణిగేలా చేయాలని ఎమ్మెల్యే కిలివేటి దువ్వూరును కోరినట్లుగా తెలిసింది.

ఆసరా ద్వారా కుటుంబం అభివృద్ధి చెందాలి

కేవీబీపురం మార్చి1: ప్రభుత్వం అందజేసే ఆసరా ద్వారా కుటుంబాలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తిరుపతి ఎంపీ గురుమూర్తి చెప్పారు. శుక్రవారం మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఎంపీ, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మహిళలకు ఆసరా చెక్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఏపీఎం మమత, రాష్ట్ర డైరెక్టర్లు కృష్ణయ్య, ధనుంజయరెడ్డి, జడ్పీటీసీ మున్నెమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మా వల్ల కాదంటున్న మహిళలు

మండల కేంద్రంలో ఆసరా చెక్కుల పంపిణీ నిమిత్తం ఉదయం నుండే మహిళలు సమావేశానికి చేరుకున్నారు. నాయకులు సమయపాలన పాటించకపోవడంతో మా వల్ల కాదయ్యా అంటు ఇళ్ళకు బయలుదేరారు. దీంతో వెలుగు సిబ్బంది వెళ్ళిపోయే మహిళలను అడ్డుకున్న కానీ ఫలితం లేకుండ పోయింది.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు



తొట్టంబేడు, మార్చి1: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి సుధీర్ రెడ్డి నివాసంలో తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగ గ్రామానికి చెందిన వైసీపీ నాయుకులు రమేష్‌యాదవ్, రాంమూర్తి యాదవ్ మిత్రబృందం సుమారు వందమందికి పైగా టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సుధీర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటాచలం, ప్రతాప్ రెడ్డి, మునిరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశపరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెస్ట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీ పరీక్ష ఏప్రిల్ 25, ఏపీపాలిసెట్ ఏప్రిల్ 27వ తేదీ నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రుయాస్పత్రిలో చుక్కల దుప్పి మృతి

తిరుపతి సిటీ, మార్చి 1: అడవిలో నుంచి జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కంగారులో రుయాస్పత్రిలోకి వచ్చి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రుయాస్పత్రి కార్యాలయ భవనం వెనుక ఉన్న దట్టమైన పొదల్లో చుక్కల దుప్పులు ఎక్కువగా సంచరిస్తూ ఉండేవి. నూతన భవనాల నిర్మాణాల కోసం కొంతకాలంగా ఆ చెట్లను తొలగిస్తున్నారు. దీంతో అక్కడ సంచరించే చుక్కల దుప్పులు సమీపంలోని జూపార్కు రోడ్డులోని అడవుల్లోకి వెళ్లిపోయాయి. ఇంకా కొన్ని సమీపంలోనే సంచరిస్తున్నాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంతం నుంచి సైకియాట్రీ వార్డు మీదుగా చిన్నపిల్లల వార్డు వద్దకు వచ్చిన ఓ చుక్కల దుప్పిని కుక్కలు వెంబడించడంతో పరుగులు తీస్తూ రుయాస్పత్రిలోని ఎమ్మారై స్కానింగ్ కేంద్రం వద్దకు వచ్చింది. అక్కడ నుంచి పారిపోయేందుకు ఐదు అడుగుల ఎత్తులో ఉన్న కంచెను దాటే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. గమనించిన స్థానికులు దానికి సాయం చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే అది మృతిచెందింది. ఇక్కడకు వచ్చే సమయంలోనే ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉందని, భయంతో ఇటుగా పరుగులు తీసి ఇక్కడికి వచ్చి మృతిచెందిందని స్థానికులు తెలిపారు. సమాచారమిచ్చినా అటవీ అధికారులు ఆలస్యంగా రావడంతో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది కాపలాగా ఉండి అప్పగించారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

మద్యం మత్తులో సహోద్యోగితో గొడవే కారణం



లక్ష్మీనారాయణ

పాకాల, మార్చి 1: పాకాల పోలీస్ స్టేషన్‌లో మద్యం సేవించి సహోద్యోగితో గొడవపడిన హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను ఎస్పీ మలిక గర్గ్ శుక్రవారం సస్పెండ్ చేశారు. చాలాకాలంగా ఈయన మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి. గురువారం సాయంత్రం కూడా మద్యం సేవించి విధులకు హాజరై మరో హెడ్ కానిస్టేబుల్ మొగిలీశ్వరరెడ్డితో గొడవ పడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో ఎస్పీ విచారణ జరిపించారు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భాకరాపేటలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంకటరమణపై అవినీతి ఆరోపణలు రావడంతో బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. రెండురోజుల వ్యవధిలో ఇద్దరు సస్పెండ్ కావడం పోలీసుల్లో చర్చనీయాంశమైంది.

ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి



మహేష్

చంద్రగిరి, మార్చి 1: తనను ప్రేమించలేదన్న కోపంతో ఓ యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడి వుదంతం కలకలం రేపింది.పోలీసుల కథనం మేరకు తల్లిదండ్రులు చిన్నవయసులోనే మృతి చెందండంతో చంద్రగిరి పట్టణంలో ఓ యువతి తన అమ్మమ్మతో అద్దె ఇంట్లో ఉంటూ, తిరుపతి సమీపంలోని ఓ కళాశాలలో నర్సింగు కోర్సు చదువుతోంది.ఈ క్రమంలో ఆమె ఇంటి కింది భాగంలో వుంటోన్న మహేష్‌తో పరిచయం ఏర్పడింది.అయితే మహేష్ మద్యం సేవిస్తూ జులాయిగా తిరుగుతున్నాడని తెలిసి ఆమె ఒకటిన్నర నెల క్రితమే మాట్లాడడం ఆపేసింది. దీంతో మహేష్ మద్యం సేవించి యువతి ఇంట్లోకి వెళ్ళి గొడవ చేశాడు.దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆ యువతి తరువాత చెన్నైలో ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్ళిపోయింది. బుధవారం రాత్రి ఆమె చెన్నై నుంచి వచ్చిందని తెలుసుకున్న మహేష్ మద్యం సేవించి ఇంట్లోకి చొరబడి కత్తితో ఆమెపై దాడి చేశాడు.ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎక్కడ: జనసేన

తొట్టంబేడు, మార్చ్1: వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎక్కడ అని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇంచార్జి కోట వినుత ప్రశ్నించారు. శ్రీకాళహస్తి మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలలోని ఎర్రమరెడ్డిపలె గ్రామంలో జనసేన విజయ యాత్ర.ఏపీ నీడ్స్ పవన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మినిమోనిపెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కావలిశివకుమార్, నాయుకులు రామ్‌సురేంద్ర, అంకయ్య, గురవయ్య, గణేష్, రవికుమార్‌రెడ్డి, లక్ష్మి, శారద, జ్యోతి, మేమంత్‌గౌడ్, చిరంజీవి, సురేష్, రాజేష్, జనసైనికులు పాల్గొన్నారు.

విద్యాదీవెన నిధుల జమ

39,368మంది విద్యార్థులకు రూ.29.50కోట్ల లబ్ధి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1: జిల్లాలో విద్యాదీవెన పథకంలో 39,368 మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. 2023 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి చెందిన ఫీజు రీయింబర్స్ ఆర్థిక సాయాన్ని శుక్రవారం తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. జమ అయిన పదిరోజుల లోపు సంబంధిత కళాశాలలకు చెల్లించి సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు చెక్కును అందజేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు, అధికారులు హాజరయ్యారు.

భూ వివాదాల పరిష్కారానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం

సీఎం సలహాదారు అజయ్ కల్లం



అజయ్ కల్లంను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1: రైతుల మధ్య ఏర్పడిన భూ వివాదాలను పరిష్కరించే లక్ష్యంతోనే ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలు చేస్తోందని సీఎం సలహాదారు అజయ్ కల్లం పేర్కొన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరి సెమినార్ హాల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత భూ రికార్డులకు స్వస్తి పలకాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రైతులందరికీ శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అమల్లోకి తీసుకొచ్చామన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. తద్వారా భూ హక్కులపై రైతులకు పూర్తిస్థాయి భరోసా లభిస్తుందన్నారు. బ్రిటీష్ కాలంలో భూ రికార్డులు సక్రమంగా నిర్వహించలేదన్నారు. నాటి రికార్డులను ఆధునికీకరించడంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయని, తద్వారా భూ యజమానులు భూమిమీద సంపూర్ణ హక్కులు కోల్పోవడం జరుగుతుందన్నారు. రీ సర్వేలో భాగంగా ఎయిర్ క్రాఫ్ట్, రోవర్ వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి భూ సరిహద్దును జియో రెఫరెన్స్ చేసి రైతులకు హక్కు పత్రాలను జారీచేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం పట్ల రైతులకు అవగాహన పెంపొందించేందుకు వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో మొదటి కార్యక్రమం ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. భూ వివాదాలకు సంబంధించి రైతులు అడిగిన ప్రశ్నలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌వో పెంచల్‌కిశోర్, తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, సర్వే అధికారి జయరాజ్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు, బ్యాంకింగ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్సే

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 1: అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆర్టీఏ మాజీ కమిషనర్ తాంతియా కుమారి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందని విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు అధికారం చేపట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నించారే తప్పా ప్రత్యేక హోదా కోసం పోరాడలేదన్నారు. ప్రశ్నించే వారిపై ఈడీ కేసులు నమోదు చేయడం బీజేపీకి పరిపాటిగా మారిందన్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ఒక చేత్తో డబ్బు ఇచ్చి, మరో చేత్తో మద్యం రూపంలో తీసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. అనంతరం మహిళా కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షురాలిగా మోసిన బేగంను నియమించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గాల ఇన్‌చార్జులు సుశీల, సుభాషిణి, భాను, శివకుమారి పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలకు ఘనస్వాగతం

రేణిగుంట,మార్చి 1 : తిరుపతి పర్యటనలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు శుక్రవారం ఆపార్టీ నాయకులు ఘనంగా స్వాగతించారు. స్వాగత పలికిన వారిలో డీసీసీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి , రేణిగుంట మండల పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, మార్చి 1: చంద్రబాబు నాయుడుతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సముదాయంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, డాక్టర్ హెలెన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా హెలెన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలు, మోసాలకు స్వస్తి పలకాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గిరిబాబు, షణ్ముగం, పొన్నుస్వామి, వేల్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మునివేలు, లత, గోపీ తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట ఎస్‌ఐగా సుధాకర్



వడమాలపేట, మార్చి 1: వడమాలపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా టీవీ.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామాంజనేయులు తిరుపతిలోని ఎస్వీ యూనివర్శిటీ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. తిరుపతి స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐగా ఉన్న సుధాకర్ వడమాలపేటకు వచ్చారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ గుర్రపు స్వారీ

పుత్తూరు టౌన్, మార్చి 1: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ శుక్రవారం గుర్రపు స్వారీ నిర్వహించారు. షో జంపింగ్, టెంట్ పెగ్గింగ్ ప్రదర్శనలు అకట్టుకున్నాయి. అంతకుముందు కళాశాలలో స్విమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కల్నల్ ప్రకాష్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మెడికల్ షాపులో చోరీ

పుత్తూరు అర్బన్, మార్చి 1: పుత్తూరు పట్టణ పరిధిలోని మెడికల్ షాపులో చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... గేటు పుత్తూరుకు చెందిన ఓంకార్ పాత తిరుపతి రోడ్డు రైల్వే క్యాబిన్ వద్ద ఉన్న మెడికల్ షాపు నడుపుతున్నాడు. గురువారం రాత్రి దుకాణం మూసివేసి దాసరి గుంట వీధిలోని స్వగృహానికి వెళ్లారు. శుక్రవారం వేకువజామున తలుపులు తీసి ఉండడంతో స్థానికులు గుర్తించి యజమాని ఓంకార్‌కు సమాచారం అందించారు. దుకాణం వద్దకు వెళ్లి చూడగా తలుపులు పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.50 వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ క్రాప్ నమోదులో అభ్యంతరాలుంటే చెప్పండి

వడమాలపేట, మార్చి 1: మండలంలో 623 మంది రైతులకు సంబంధించి 2292 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు ఈ క్రాప్ నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ముసాయిదా జాబితా రైతుల భరోసా కేంద్రాల వద్ద ఉందని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు.

నారాయణవనం: మండలంలో క్రాప్ ముసాయిదా నమోదు చేసుకున్న రైతుల జాబితా రైతు భరోసా కేంద్రాలలో ఉందని ఏవో శోభరాణి తెలిపారు. జాబితాను రైతులను సరిచూసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 5వతేదీ లోగా రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 0877-2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

టీడీపీతోనే పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం



కరపత్రాలు విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 1: పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని మంచినీళ్ల బావివీధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఎన్నుకోబడిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల అధికారాలను కాలరాస్తూ సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను తీసుకురావడం ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును అవహేళన చేయడమేనని దుయ్యబట్టారు. స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించి గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కూడా కల్పించలేని దుస్థితికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను తీసుకువచ్చారని దుయ్యబట్టారు. ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేక ప్రజల ముందు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దోషులుగా నిలబడాల్సిన పరిస్థితికి జగన్ ప్రభుత్వ అహంకార వైఖరే కారణమని మండిపడ్డారు. దీనిని గుర్తించే టీడీపీ నాయకత్వం, చంద్రబాబునాయుడు ప్రజాప్రతిధుల ఆత్మగౌరవాన్ని, స్వపరిపాలనను తిరిగి గ్రామాల్లో తీసుకువచ్చేందుకు కార్యాచరణ ప్రకటించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థలకు ఎలాంటి అవరోధాలు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదలతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా సర్పంచ్‌లు, కౌన్సిలర్ల వేతనం రూ.3 వేల నుంచి రూ.10 వేలకు, జడ్పీటీసీల వేతనం రూ.6 వేల నుంచి రూ.15 వేలకు, ఎంపీపీల వేతనం రూ. 10 వేల నుంచి రూ.20 వేలకు, జడ్పీ చైర్మన్ల వేతనం రూ.40 వేల నుంచి రూ.50 వేలకు పెంచుతామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. దీనిని ప్రతి ప్రజాప్రతినిధి గుర్తించి రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. తడుకు సర్పంచు బొబ్బిలియాదవ్, కరుణాయాదవ్, కోట గజపతి, జయకర్, మోహన్‌రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఓర్పు, సేవాతత్వం అవసరం



పుత్తూరు టౌన్, మార్చి 1: స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఓర్పు, సహనం, సేవాతత్వం అవసరమని, ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి అన్నారు. శుక్రవారం పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మొత్తం 96 మంది విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ఎంపికయ్యారని, ప్రతి 32 మందిని ఒక యూనిట్‌గా విభజించి ముగ్గురు ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమీషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఓర్పు, సహనం, ఆధ్యాత్మిక భావనలు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్స్ చారులత, దీపిక, గీతిక సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో విద్యార్థులు



అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రాకారోత్సవం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం విశేషంగా అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో విజయ స్థూపం వరకూ ప్రాకారంగా ఊరేగించి తిరిగి కొలతువు దీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులుపాల్గొన్నారు.

వైసీపీ కార్యక్రమంలా ఆసరా సభ



జై జగన్ అనాలని చెబుతున్న రాజేష్, ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు, మార్చి 1: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలేవీ అందవని సత్యవేడు వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మహిళలను ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారు. సత్యవేడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం జరిగిన వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచార కార్యక్రమంగా మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ టీడీపీ వాళ్ల చెప్పే మాటలు నమ్మవద్దని, మళ్లీ వైసీపీనే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా కార్యక్రమానికి మండల వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల మహిళలను తీసుకొచ్చారు. జై జగన్ అంటూ నినాదాలు ఇవ్వాలని రాజేష్ పలుమార్లు మహిళలను అభ్యర్థించిన మహిళల నుంచి పెద్దగా స్పందన రాకపోవడం గమనార్హం. కార్యక్రమం 3 గంటలకు ప్రారంభం కావలసి ఉండగా మహిళలను మధ్యాహ్నం 1 గంటకు తీసుకురావడంతో మహిళలు అసహనం వ్యక్తం చేస్తూ కార్యక్రమం నుంచి జారుకున్నారు. ఈ కార్యక్రమం నుంచి వెళ్లిపోతున్న మహిళలను నిలువరించడం వెలుగు సిబ్బంది, సంఘ మిత్రలకు కష్టతరంగా మారింది. ఏపీఎం స్వర్ణలత, ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ విజయలక్ష్మి, ఎంపీడీవో చంద్రశేఖర్, సంఘమిత్రలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విభేదాలను వీడండి: ఎంపీ

సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన నూకతోటి రాజేష్ విజయం కోసం విభేదాలు వీడి, సమష్టిగా పని చేయాలని ఎంపీ గురుమూర్తి ఆ పార్టీ శ్రేణులను కోరారు. శుక్రవారం సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ మండపంలో వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేష్ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పార్టీని గెలిపించుకోవడానికి కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. చిన్నపాటి విభేదాలున్న పక్కన పెట్టాలన్నారు. కార్యకమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, మార్చి 1: స్వర్ణముఖి నదిలో గుర్తు తెలియని వ్యక్తి సుమారు (37) ఏళ్ల వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో వెలుగు చూసింది. రామసేతు వంతెన సమీపంలోని స్వర్ణముఖి నది నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు కోసం ఆరా తీశారు. ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'గడప గడప'కు వస్తేనే పింఛను!

ఏర్పేడు, మార్చి 1: మండలంలోని ఎండీపుత్తూరులో శుక్రవారం జరిగిన గడప గడపకు వెళ్తేనే పింఛను ఇస్తామని ఏర్పేడు మండలం చెల్లూరు దళితవాడకు చెందినవారికి అధికారులు హుకుం జారీ చేశారు. ఏర్పేడు మండలం చెల్లూరు దళితవాడలో శుక్రవారం ఉదయం ఇవ్వాల్సిన పింఛను సాయంత్రం వరకు ఇవ్వలేదు. శుక్రవారం సాయంత్రం ఎండీపుత్తూరు గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి చెల్లూరు దళితవాడకు చెందిన ప్రజలు వస్తేనే పింఛను ఇస్తామని అధికారులు, వైసీపీ నాయకులు చెప్పినట్లు సమాచారం.

బాలికపై అత్యాచారయత్నం

కేవీబీపురం మార్చి1: మండలంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై గురువారం పెయింటర్ నక్కబోయిన జగదీష్(28) అత్యాచారానికి ప్రయత్నించాడు. ఈ విషయమై బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని, నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్ఐ సునీల్ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికురాలి మృతిపై కేసు



మృతురాలు స్వాతి

రేణిగుంట, మార్చి 1 : స్థానిక వినాయక నగర్‌లో భవన నిర్మాణ కార్మికురాలు బి. స్వాతి (25) మృతిపై కేసు నమోదు చేశామని రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వినాయక నగర్‌లో భవననిర్మాణ పనులు చేస్తుండగా ఇనుప కమ్మీలు విద్యుత్‌తీగలకు తగిలి స్వాతి గురువారం మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ సంఘటనపై మృతురాలి భర్త సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా అనంతరం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్టు ఎస్ఐ వెల్లడించారు. కాగా మృతురాలు శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం రౌతుపురం గ్రామ వాసిగా పోలీసులు గుర్తించారు.

రిటైర్డ్ ఉద్యోగికి ఘన సన్మానం

శ్రీకాళహస్తి, మార్చి 01: శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం సెక్షన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జాకీర్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఆయన సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు.

టీడీపీతోనే యాదవుల అభివృద్ధి: సుధీర్



యాదవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ రెడ్డి

తొట్టంబేడు, మార్చ్1: యాదవులు అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని యాదవుల ఆత్మీయ సమావేశం సుధీర్‌రెడ్డి స్వగ్రామం ఊరందూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులకు గొర్రె, మేకపిల్లలను సబ్సిడీపై ఇప్పింపించి ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కామేష్‌యాదవ్, మురాజయాదవ్, బలరామయాదవ్, రామకృష్ణయాదవ్, క్రిష్ణాయాదవ్, బాస్కర్‌యాదవ్, సురేంద్రయాదవ్, తదితరులుపాల్గొన్నారు.

ఏడుగురు టీడీపీ నేతలపై రౌడీషీట్ ఓపెన్

ఏర్పేడు, మార్చి 1: మండలంలో కీలకంగా టీడీపీకి పనిచేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు ఏడుగురుపై ఏర్పేడు పోలీసులు జనవరి 12న రౌడీషీట్ ఓపెన్ చేశారు. అయితే ఈ విషయం శుక్రవారం వెలుగులోకి రాగా, టీడీపీ నేతలు పేరం ధనంజయులునాయుడు, రాయపనేని మల్లికార్జుననాయుడు, పేరం చిరంజీవులునాయుడు, పేరం నాగరాజునాయుడు, కందాటి శివశంకర్‌రెడ్డి, నిరంజన్‌బాబు నాయుడు, పూల హేమాక్షిలకు ఏర్పేడు ఎస్ఐ జిలాని ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు రావాలని తెలిపారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

శ్రీసిటీ ట్రిపుల్ ఐటీలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీసిటీ, మార్చి 1: శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మూడు రోజుల టెక్నో కల్చరల్ ఫెస్ట్(అభిసర్గ 2024 పేరిట) కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇస్రో డైరెక్టర్ ఏ.రాజరాజన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రిపుల్ ఐటీ కళాశాల ఆడిటోరియంలో దీనిని ప్రారంభించారు. ఇతర అతిథులుగా ఖరగపూర్ ఐఐటీ ప్రొఫెసర్ విశ్వనాథ్, నాగరాజన్, అంబర్ గ్రూప్ జనరల్ మేనేజర్ జగదీప్ పూనియా తదితరులు పాల్గొన్నారు. సాంకేతికపరంగా కొత్త కొత్త అంశాల్లో తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పరస్పరం తమ భావాలను పంచుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ ప్రతినిధులు సోమయాజులు, రాహుల్ కట్టి, కల్నల్ టి.ఉమాశంకర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సత్యవేడు, మార్చి 1: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల చీఫ్, ప్రిన్సిపాల్ జగన్మోహనాచారి, డిపార్ట్‌మెంట్ అధికారి జాకీర్ హుస్సేన్ పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు కొనసాగాయి. కాగా 283 మందికి 275 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారులు పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశారు.

శోభాయమానం...శివ భక్తుల వైభవం

శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తి పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో నంది, శ్రీ-కాళ-హస్తి ప్రతిమలతో విద్యుత్ దీపాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. శ్రీ (సాలె పురుగు) కాళ (పాము) హస్తి (ఏనుగు) క్షేత్రంలో అచంచల భక్తితో పరమశివుని పూజించి ముక్తి పొందిన విషయం తెలిసిందే. ఆ మూడు జీవాల పేరుతోనే క్షేత్రం విరాజిల్లుతోంది. నిరంతరం శివ దర్శనంలోనే తరించే వరం పొందిన పరమ భక్తులైన నంది, అలాగే ముక్తి పొందిన మూడు జీవాలు చతుర్మాడ వీధుల్లో ఒక్కో దానికి ప్రత్యేకతగా పెద్దలు చెబుతుంటారు. తేరు వీధికి నంది, నెహ్రూ వీధికి సాలు పురుగు, నగిరి వీధికి పాము, బజారు వీధికి ఏనుగు ప్రత్యేకగా ముక్కంటి ఆలయ అధికారులు తీసుకున్నారు. ఆ శివ భక్తుల ప్రతిమలను విద్యుత్ శోభతో ప్రకాశించేలా అలాగే 150 వాట్స్ విద్యుత్ సామర్థ్యంతో వెలిగే వీధి దీపం స్తంభాలను ఏర్పాటు చేశారు. మహాశివరాత్రికి ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆలయ అధికారులు చెబుతున్నారు.



చతుర్మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన దీపాలు- (ఇన్‌సెట్‌లో పాము, ఏనుగు చిహ్నాలు)

వైభవంగా ధ్వజారోహణం

ఘనంగా పల్లికొండేశ్వరుడి పల్లకి సేవ







ధ్వజపటంతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు - ధ్వజారోహణం చేస్తున్న ఆలయ అర్చకులు - పల్లకి సేవలో స్వామి, అమ్మవార్లు

నాగలాపురం, ఫిబ్రవరి మార్చి 1: మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయ ధ్వజస్తంభం వద్ద పంచ మూర్తుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తకంగా అభిషేకాలను చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలోని యాగశాల మండపంలో వృషభయాగం నిర్వహించారు. పూర్ణాహుతి జరిపి నందీశ్వరుడి చిత్ర పటం ఉన్న ధ్వజ పతాకానికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు మీన లగ్నంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా ధ్వజారోహణం నిర్వహించి ముక్కోటి దేవతలకు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు.

పల్లకిలో పరమేశ్వరుడి దివ్యస్వరూపం

పల్లికొండేశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పల్లకి సేవలో పార్వతీ పరమేశ్వరుల దివ్య స్వరూపం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి, మహా హారతులు పట్టి, పల్లకిలో కొలువు దీర్చి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ పూజలకు మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఛైర్మన్ ఏ.వి.ఎం బాలాజీరెడ్డి, కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

ముక్కంటీశుడికి పట్టు వస్త్రాల వితరణ



పట్టు వస్త్రాలు అందజేస్తున్న గురు ప్రసాద్

శ్రీకాళహస్తి, మార్చి 1 : మదనపల్లిలోని జ్ఞాన ప్రసూనాంబిక డిగ్రీ కళాశాల నిర్వాహకులు రాటకొండ గురుప్రసాద్ ముక్కంటి ఆలయానికి పట్టు వస్త్రాలను వితరణ చేశారు. శుక్రవారం కుటుంబ సమేతంగా ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం గురు ప్రసాద్ మహాశివరాత్రి ఉత్సవాలకు ముందు ఆలయానికి వచ్చి పట్టు వస్త్రాలను సమర్పిస్తుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి 9 పట్టుచీరలు, స్వామివారికి 9 పట్టు పంచలు సమర్పించారు. ఈ సందర్భంగా దాత గురు ప్రసాద్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి క్షేత్రం ఎంతో మహిమాన్వితమని, ఇక్కడి అమ్మవారైనా జ్ఞాన ప్రసూనాంబిక పేరుతోనే మదనపల్లి లో డిగ్రీ కళాశాల నడుపుతున్నామని చెప్పారు. వరుసగా 23వ సంవత్సరం జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో మహద్భాగ్యంగా భావిస్తున్నామన్నారు. అనంతరం దాతను ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ మాజీ ధర్మకర్తల మండల ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాలం ముగిసినా ఇదేంటయ్యా...!

● శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల అత్యుత్సాహం

శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు పదవి కాలం ఫిబ్రవరి 29తో ముగిసిపోయింది. కానీ ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న అంజూరు శ్రీనివాసులు శుక్రవారం యథావిధిగా ఆలయ ఛైర్మన్ హోదాలో వ్యవహరించారు. మదనపల్లెలోని జ్ఞాన ప్రసూనాంబ డిగ్రీ కళాశాల అధినేత గురుప్రసాద్ ఏటా శివరాత్రి ఉత్సవాలకు పట్టు వస్త్రాలు ఆలయానికి ఇవ్వడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయానికి దాత కుటుంబం వచ్చింది. ఆలయాధికారులు నేరుగా అంజూరు శ్రీనివాసులు వద్దకు తీసుకెళ్లి ఆయన చేతులమీదుగా అందజేయించారు. నిజానికి బోర్డు పదవీకాలం ముగిసిన తర్వాత అధికారులే దాతల వద్ద నుంచి విరాళాలు, నగదు స్వీకరించాలి. కానీ అధికారులు ఇంకా అంజూరు సేవలో తరించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి.

ఏపీలో బీజేపీని ఆదరించండి



ప్రజాపోరు కార్యక్రమంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

తొట్టంబేడు, మార్చ్1: ప్రదాని నరెంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలే ఏపీలో బీజేపీని గెలిపిస్తాయని రాష్ట్రకార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనందకుమార్ అన్నారు. మండలంలోని పోయ్యకొత్తూరు గ్రామంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు.. అనంతరం పొయ్యకొత్తూరు, గ్రామాలలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అమ్మపాళెం రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వేడెం కృష్ణయ్య, శ్రీకాళహస్తి నియోజకవర్గ కోకన్వీనర్ మెళాగారం సుబ్రమణ్యం రెడ్డి, కందాటి సుబ్బిరామిరెడ్డి,రమణ, గోపాల్, గీత, మునిరాజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లన్నకు సారె సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీశైలం మల్లన్నకు శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సారె సమర్పించారు. మల్లన్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు శ్రీశైలం చేరుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఏఈఓ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ



కమిషనర్ రమేష్ బాబు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1: శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ చేయనున్నట్లు కమిషనర్ రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. ఆస్తి, ఖాళీ జాగా పన్నుల బకాయిలను మార్చి నెల 31వ తేది లోగా చెల్లించే వారికి వడ్డీ మాఫీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరణియార్ సందర్శించిన ట్రైనీ డీఎస్పీ



ఎస్ఐ, సీఐలతో కలసి అరణియార్‌ను సందర్శిస్తున్న ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ

పిచ్చాటూరు, మార్చి 1: పుత్తూరు ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ శుక్రవారం పిచ్చాటూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. అరణియార్ పర్యాటక కేంద్రాన్ని సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్‌నాయక్, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలసి ఇంటర్ పరీక్షకేంద్రాలను సందర్శించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ చేరుకుని రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు.

సమస్యలపై వైసీపీ నాయకుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

తొట్టంబేడు, మార్చ్1: మండలంలోని సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై వైసీపీ నాయకులు గళం విప్పారు. మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీపీ నిర్మల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంబయ్యపాళెం సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి తమ గ్రామానికి రేషన్ పంపిణీ వాహనం రావడంలేదని ప్రశ్నించగా, మండలంలోని చాలా ఊర్లకు రావడం లేదన్నారు. చిన్నకనపర్తి, బోనుపల్లి సర్పంచ్‌లు ఎన్‌టీఆర్ హౌసింగ్ స్కీమ్ కింద గత ప్రభుత్వంలో మంజూరై నిర్మించుకున్న ఇళ్లకు ఇంత వరకు నగదు ఎందుకు .మచేయలేదని హౌసింగ్ అధికారులను నిలదీశారు. వైసీపీ ఎంపీపీ భర్త వాసుదేవనాయుడు ఇరిగేషన్ అధికారులను నిలదీయడంతో సమావేశం ఒక్కసారిగా రసాబాసగా మారింది. పెద్దకన్నలి ట్యాంక్ నుంచి పెద్దకాల్వ, చిన్నకాలువ, పొయ్య, తాటిపర్తి, కొమ్మనగుంట గ్రామాలకు వెళ్లే కాలువలకింద 1400ఎకరాల ఆయకట్టు ఉంది. కాని ఆ కాలువలు ఎక్కడ ఉన్నాయని, దానిపై ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిక, పీఏసీయస్ ఛైర్మన్ మణినాయుడు, ప్రజాప్రతినిదులు అధికారులు పాల్గొన్నారు.

పాండూరు సచివాలయానికి దారేది ?



సచివాలయానికి వెళ్లే మార్గంలో దున్నేసిన భూమి

వరదయ్యపాళెం, మార్చి 1: మండలంలో ప్రభుత్వ భూములు మాత్రమే కాదు పట్టా భూములు సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. పాండూరు రెవెన్యూ పరిధిలో 915/5 సర్వే నెంబరులో 4.76 ఎకరాల ప్రభుత్వ భూమిలో 2.7ఎకరాలను ప్రభుత్వ పాఠశాలకు కేటాయించారు. ఈ స్థలంలోనే రూ.40లక్షలతో సచివాలయం నిర్మించారు. పక్కనే ఆర్బీకే భవనం నిర్మాంచాల్సి ఉంది. అయితే ఇక్కడే చిక్కొచ్చిపడింది. సచివాలయానికి దారి లేకుండా ఓ రైతు ఆ భూమి తనదంటూ దున్నేశాడు. దీంతో సచివాలయానికి రావాలంటే సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా కొన్నేళ్ల క్రితం 915/5బిలో 1.70 ఎకరాలను అప్పటి తహసీల్దారు పుల్లయ్య ఓ రైతు పేరుమీద పట్టా మంజూరు చేసినట్లు నకిలీ పట్టా రూపొందించుకున్నాడని గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయగా జాయింట్ కలెక్టర్ ఆ పట్టాను రద్దు చేశారు. తహసీల్దారు వివరణతో సీసీఎల్ విచారనలో ఆ పట్టా చెల్లదనే చెప్పారు. హైకోర్టులో కూడా ఇదేసమాధానం వచ్చింది. కాగా హైకోర్టు దిగువ బెంచిలో ఈ పట్టాకు సంబంధించి విచారణ సాగుతోంది. ప్రస్తుత అధికారులు వివరణ పంపడంలో జాప్యం చేయడంతో భూసమస్యలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదే అదనుగా మునిరాజా అనే వ్యక్తి తన భూమి అంటూ సచివాలయం ముందున్న ప్రభుత్వ భూమి, పాఠశాల భూమి, పనికి ఆహార పథకం కింద గిరిజనకాలనీకి వేసిన రోడ్డును కూడా తనదేనంటూ ఆక్రమించేశాడు.